క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో ఈ నెల 23న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ వరంగల్ డివిజన్ ఎస్ఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. పుప్పాలగుట్ట, ఏఎస్‌రెడ్డి నగర్, శివనగర్, రైల్వే ట్రాక్, గంగదేవి హోటల్, మసీదు ప్రాంతాల్లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

విద్యార్థులకు టై, బెల్టుల పంపిణీ



న్యూశాయంపేట: టి.రంజిత్‌కుమార్, మౌనిక దంపతులు తన కుమారుడి పుట్టినరోజు సందర్భంగా వరంగల్ మండల పరిధిలోని 3వ డివిజన్ పైడిపల్లి ఎంపీపీఎస్‌లో 122 మంది విద్యార్థులకు టై, బెల్టులను మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాదావత్ దస్రు, ఉపాధ్యాయులు శ్రీరాములు, శ్రీను, పద్మ, వసంత, అనిత, జన్ను పారిజాత, జన్ను సంపత్ పాల్గొన్నారు.

స్టీల్ వాటర్ బాటిళ్ల అందజేత



కాజీపేట అర్బన్: కాజీపేట మండలం అయోధ్యపురంలోని మండల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిళ్లను దాతలు గొర్రె మనీష్, శ్రీలేఖ దంపతులు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మన్నె చంద్రయ్య మాట్లాడుతూ మనీష్, శ్రీలేఖ దంపతుల కుమారుడు అశ్వద్‌దేవ్ జన్మదిన సందర్భంగా స్టీల్ వాటర్ బాటిళ్లు అందజేయగా, వాటిని మడికొండకు చెందిన బోగిని నాగరాజు మంగళవారం పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు శారదాదేవి, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కొండా సురేఖకు ఆహ్వానం



హన్మకొండ కల్చరల్: రుద్రేశ్వరస్వామి వేయి స్తంభాల దేవాలయంలో ఈ నెల 25 నుంచి ప్రారంభం కానున్న శ్రావణ మాసోత్సవాల పూజలకు హాజరుకావాలని దేవాదాయ ధర్మాదాయశాఖ మంత్రి కొండా సురేఖను అర్చకులు ఆహ్వానించారు. ఈ మేరకు హనుమకొండ రాంనగర్‌లోని మంత్రి నివాసంలో ఆమెను వేయిస్తంభాల దేవాలయ ఈఓ ధరణికోట అనిల్‌కుమార్, ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ, తదితరులు మంగళవారం కలిసి శ్రావణ మాసోత్సవాల ఆహ్వానపత్రికను అందజేశారు. ఈ నెల 28న ప్రథమ సోమవారాన్ని పురస్కరించుకుని రుద్రహోమం, స్వామివారికి మహాన్నపూజ, మహాన్నప్రసాదాల వితరణలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

వ్యాపారులకు జరిమానా



సాక్షి స్పందన

కాజీపేట: కాజీపేట చౌరస్తాలో హోటళ్ల వ్యర్థాలను సైడ్ డ్రెయినేజీల్లో పారబోస్తూ పరిసర ప్రాంతాలను కలుషితం చేస్తున్న వ్యాపార సంస్థలపై మున్సిపల్ అధికారులు కొరడా ఝుళిపించారు. ఈ మేరకు రూ.5వేల జరిమానా విధించారు. హోటళ్ల వ్యర్థాలతో అనర్థాలు అంటూ సాక్షి దినపత్రికలో వచ్చిన కథనంతో మున్సిపల్ సీఎంహెచ్‌ఓ రాజారెడ్డి ఆదేశం మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌తో కలిసి మున్సిపల్ సిబ్బంది మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా చౌరస్తాలో ఉన్న కాలువల్లో వ్యర్థాలు పడవేయడం వల్ల కలిగే అనర్థాలపై వ్యాపారులకు ఎస్సై రవీందర్ కౌన్సెలింగ్ నిర్వహించారు.

లింక్డ్ ఇన్సూరెన్స్‌పై ఉద్యోగులకు అవగాహన



హన్మకొండ అర్బన్: కాజీపేట ఈపీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ఉద్యోగుల లింక్డ్ ఇన్సూరెన్స్ పథకంపై మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సును ప్రాంతీయ కమిషనర్ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇన్సూరెన్స్ పథకంలో చేరడం వల్ల ఉద్యోగులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ శివకేశ్ మీనా, అధికారులు పాల్గొన్నారు.

తీరని 'భగీరథ' బాధలు

- కలుషితమవుతున్న తాగునీరు
- పైపులైన్ లీకేజీ కారణమంటున్న స్థానికులు
- మరమ్మతులు చేసినా అదే పరిస్థితి
- చూసీచూడనట్లు 'మిషన్' అధికారులు

శాయంపేట : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గల మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ నుంచి గ్రామంలోని కొన్ని వీధులకు సరఫరా అవుతున్న తాగునీరు కలుషితమై కొన్నిరోజులుగా బురదనీరు వస్తుందని స్థానికులు ఆగ్రహిస్తున్నారు. జోగంపల్లి శివారులోని చలివాగు ప్రాజెక్టు నీటిని మిషన్ భగీరథ వాటర్‌గ్రిడ్ ద్వారా శుద్ధి చేసి మండలంలోని 24 గ్రామాలకు తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఈ క్రమంలో వారంరోజులుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో గల వాటర్ ట్యాంక్ నుంచి సరఫరా అయ్యే భగీరథ నీరు బురదగా వస్తున్నాయని వివిధ కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాల్సిన మిషన్ భగీరథ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. కలుషిత నీరు కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా మిషన్ భగీరథ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు, పలు కాలనీల ప్రజలు కోరుతున్నారు.

మిషన్ భగీరథ నల్లా ద్వారా వచ్చిన కలుషిత నీరు



ఎంపీటీసీపై దాడి చేసిన వ్యక్తిని శిక్షించాలి

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య

వేలేరు : మాజీ ఎంపీటీసీ బత్తుల జ్యోతిపై దాడి చేసిన వ్యక్తిని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎంపీటీసీపై దాడి చేసిన నిందితులకు పోలీస్ అధికారులు వత్తాసు పలుకుతూ కాపాడే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. దళిత మహిళా ఎంపీటీసీపై దాడి చేసిన కాంగ్రెస్ నాయకుడిని కఠినంగా శిక్షించాలని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. 24 గంటల్లోపు దాడి చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాలని, లేని పక్షంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని



నిరసన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జ్ భూపతి రాజు, మాజీ జెడ్పీటీసీ కీర్తి వెంకటేశ్వర్లు, నాయకులు రాజేశ్వర్ రెడ్డి, సోమిరెడ్డి, తిరుపతి, శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డితో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమానికి ఊపిరిపోసిన దాశరథి రచనలు

- డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మల్లయ్య
- ఘనంగా మహాకవి శత జయంతి

పరకాల : 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అంటూ తెలంగాణ ఉద్యమానికి మహాకవి దాశరథి కృష్ణమాచార్యుల రచనలు ఊపిరి పోశాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.మల్లయ్య అన్నారు. మంగళవారం దాశరథి కృష్ణమాచార్యుల శత జయంతి వేడుకలను కళాశాలలో ఘనంగా నిర్వహించారు. దాశరథి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దాశరథి కృష్ణమాచార్యుల రచనల ప్రాముఖ్యాన్ని విద్యార్థులకు తెలిపారు. అక్షరాలనే ఆయుధంగా మలిచి కవితాధార కురిపించిన అగ్నిధార దాశరథి అని, అభ్యుదయ ఊపిరిగా నిర్భయంగా రచనలు చేసి ప్రజల పక్షాన నిలిచిన మహాకవి దాశరథి అని అధ్యాపకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో



దాశరథి కృష్ణమాచార్యులు చిత్రపటానికి పూలమాల వేస్తున్న అధ్యాపకులు

తెలుగు విభాగాధిపతి అశోక్‌మోరె, సహాయ అధ్యాపకుడు రేణ ఈశ్వరయ్య, అధ్యాపకుల స్టాఫ్ సెక్రటరీ డాక్టర్ విజయ్‌పాల్‌రెడ్డి, ఐక్యూసీ కో ఆర్డినేటర్ డాక్టర్ రామకృష్ణ, అధ్యాపకులు డాక్టర్ అశోక్, డాక్టర్ జగదీశ్‌బాబు, డాక్టర్ పావని, డాక్టర్ కల్పన, రాజశ్రీ, సమ్మయ్య, మహేందర్‌రావు, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ స్వప్న, డాక్టర్ సంజయ్, సతీష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

రైతులు అధునాతన పద్ధతులు పాటించాలి

- ప్రొఫెసర్ డాక్టర్ కోట శివకృష్ణ

దామెర : రైతులు పంటసాగులో అధునాతన పద్ధతులు పాటించాలని వ్యవసాయ కళాశాల అధ్యాపకులు సూచించారు. మండలంలోని పులుకుర్తిలో మంగళవారం రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులను ఖరీఫ్ సీజన్ కోసం సాగుచేస్తున్న పంటల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వ్యవసాయ కళాశాల పులుకుర్తి గ్రామాన్ని దత్తత తీసుకున్నట్లు చెప్పారు. మూడు సంవత్సరాల పాటు గ్రామంలో రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆధునిక సాంకేతిక విధానాలు, నూతన సాగు పద్ధతులను రైతులు పాటించాలన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు పంట క్షేత్రాలను



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తారని అన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కోట శివకృష్ణ, డాక్టర్ రాజు, డాక్టర్ రాంబాబు, నరేందర్, ఏఈఓ రామకృష్ణ, రైతులు లక్ష్మణ్, సత్యం, రమేశ్, వెంకటేశ్వర్లు, రాజు పాల్గొన్నారు.

ఒకరిపై కేసు

వేలేరు : భూమి పంచాయితీలో వ్యక్తిపై దాడి చేసిన పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అజ్మీర సురేష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లోక్యాతండా గ్రామ పంచాయతీ శివారు మిరుపకుంటతండాకు చెందిన మురవత్ భిక్షపతి, మురావత్ రాజుకు కొంతకాలంగా ఇంటి స్థలం విషయంలో గొడవలు జరుగుతున్నాయని తెలిపారు. భిక్షపతి స్థలంలో నుంచి రాజు కుటుంబ సభ్యులు వెళ్తున్నారని బాటలో ముళ్లకంప వేసినట్లు తెలిపారు. దీన్ని ప్రశ్నించిన భిక్షపతిని రాజు కుటుంబ సభ్యులు దాడి చేసినట్లు పేర్కొన్నారు. బాధితుడు భిక్షపతి భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కిక్ బాక్సింగ్‌లో వ్యవసాయ విద్యార్థుల ప్రతిభ

వరంగల్ స్పోర్ట్స్: ఈ నెల 16నుంచి 20వ తేదీ వరకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయ్‌పూర్‌లోని బల్బీర్‌సింగ్ జునేజా ఇండోర్ స్టేడియంలో జరిగిన సీనియర్ కిక్ బాక్సింగ్ పోటీల్లో వరంగల్ ములుగురోడ్డు సమీపంలోని వ్యవసాయ విద్యా కళాశాల విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారని హనుమకొండ కిక్‌బాక్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి సిరిగిరి తిరుపతి తెలిపారు. పత్తి వెంకటసాయి, జాడి మాధవి, కొమ్ము భవ్యశ్రీ కాంస్య పతకాలు సాధించినట్లు వివరించారు. ఈ మేరకు వారిని వ్యవసాయ కళాశాల డీన్ మాలతి, కిక్ బాక్సింగ్ సంఘం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రామాంజనేయులు, మహిపాల్, కోశాధికారి శ్రీనివాస్, తదితరులు అభినందించారు.

జేఈఈ ర్యాంకర్‌కు సన్మానం

ఖిలా వరంగల్: ఇటీవల ప్రకటించిన జేఈఈ అడ్వాన్స్ జాతీయ స్థాయి పరీక్షలో నగరంలోని కరీమాబాద్‌లోని న్యూ కౌటిల్యాస్ సెయింట్ ఆమస్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థిని వేదశ్రీ 7,210 ర్యాంకు సాధించి ఉత్తరాఖండ్‌లోని రూర్కీ ఐఐటీలో బయోటెక్నాలజీలో సీటు సాధించారు. ఈమేరకు ఆ విద్యార్థిని పాఠశాల కరస్పాండెంట్ కోడం శ్రీధర్, ఉపాధ్యాయులు మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కోడం సవిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పశువైద్యాధికారిపై విచారణ

హసన్‌పర్తి: ఆరోపణలు ఎదుర్కొంటున్న భీమదేవరపల్లి మాణిక్యపురానికి బదిలీ అయిన పశువైద్యాధికారి క్రాంతికుమార్‌పై శాఖాపరమైన విచారణను మంగళవారం ప్రారంభించారు. హసన్‌పర్తి పశువైద్యశాఖలో వరంగల్ జాయింట్ డైరెక్టర్ బాలకృష్ణ, భూపాలపల్లి ఏడీ గోపాల కృష్ణమూర్తి విచారణ చేపట్టి రైతుల నుంచి వాంగ్మూలం సేకరించారు.

సంక్షిప్తంగా

నేడు కోర్టులో హెల్త్ క్యాంప్

పరకాల : న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం పరకాల కోర్టులో ఉచిత హెల్త్ క్యాంప్ నిర్వహించనున్నట్లు పరకాల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి జి.సాయిశరత్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్డియాలజిస్ట్, ఆర్థోపెడిక్ వైద్యులు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు, న్యాయవాదులు, కోర్టు ఉద్యోగులు వినియోగించుకోవాలని కోరారు.

నియామకం



కొలుగూరి రాము

కమలాపూర్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యువజన సంఘం మండల ప్రధాన కార్యదర్శిగా కొలుగూరి రాము ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్లా వినోద్‌కుమార్ తెలిపారు. మంగళవారం జరిగిన అంబేడ్కర్ యువజన సంఘం సమావేశంలో ప్రధాన కార్యదర్శిగా రామును ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు షడ్రక్, మండల అధ్యక్షుడు హేమంత్‌కుమార్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీను, కరుణాకర్, నరేష్, సుజిత్, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి చేయూత



శాయంపేట : మండలంలోని కొప్పుల గ్రామానికి చెందిన బండి భాస్కర్ ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందాడు. విషయం తెలుసుకున్న అతడి చిన్ననాటి స్నేహితులు మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.20 వేలు ఆర్థికసాయం అందించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన పైడ్ల రాజయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాయరాకుల మొగిలి, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటికొండ రవికిరణ్ మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

దామెరలో పరామర్శ..

దామెర : బాధిత కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని ముదిరాజ్ యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి సతీశ్ అన్నారు. ఊరుగొండకు చెందిన మోతె బాలకృష్ణ ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా అతని కుటుంబ సభ్యులను మంగళవారం ఆయన పరామర్శించి 50 కిలోల బియ్యం, ఆర్థిక సాయం అందించారు.

'చల్లా' కృషితోనే రోడ్డుడ్యామ్ పూర్తి

నడికూడ : నడికూడ–గొల్లపల్లి గ్రామాల నడుమ రోడ్డుడ్యామ్‌పై బ్రిడ్జి నిర్మాణానికి సహకరించిన మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి మాజీ సర్పంచ్ ఊర రవీందర్‌రావు కృతజ్ఞతలు తెలిపారు. చల్లా ధర్మారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా ఎన్నికల కోడ్ నేపథ్యంలో పనులు వాయిదా పడినట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం రోడ్డుడ్యామ్ నిర్మించినప్పటికీ మాజీ ఎమ్మెల్యే చొరవతోనే పనులు జరిగాయని ఆయన అన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- సీఐ సంతోశ్

ఆత్మకూరు : మాదకద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని సీఐ సంతోశ్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం మాదకద్రవ్యాల నిర్మూలన, ఆన్‌లైన్ బెట్టింగ్‌తో నష్టాలు, సైబర్ నేరాలపై పోలీస్ కళాబృందం అవగాహన కల్పించింది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. యువత గంజాయి, డ్రగ్స్, గుట్కాలకు దూరంగా ఉండాలని అన్నారు. తల్లిదండ్రులు చెప్పినట్లు నడుచుకోవాలని సూచించారు. చదువుపై శ్రద్ధ వహించి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. మత్తు మాయలో పడి జీవితం నాశనం చేసుకోవద్దని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కవిత, రమాదేవి, ఉమెన్ ఏఎస్సై నాగమణి, విలియమ్స్, వెంకటేశ్వర్లు, రత్నయ్య, పూల్‌సింగ్, శ్రీనివాస్, విక్రమ్‌రాజ్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ సంతోశ్

ప్రభుత్వ స్థలాలను పరిరక్షించుకోవాలి

- బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికిరణ్

శాయంపేట : ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటికొండ రవికిరణ్ అన్నారు. మండలంలోని మైలారం గ్రామపంచాయతీ స్థలాన్ని కొందరు కబ్జా చేసేందుకు యత్నిస్తుండగా అడ్డుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన గ్రామపంచాయతీ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈనెల 13వ తేదీన మైలారం గ్రామానికి చెందిన కొంత మంది వ్యక్తులు పాత గ్రామపంచాయతీ స్థలంలో ప్రైవేటు కట్టడాలకు ప్రభుత్వ అనుమతులు లేకుండా సెలవు రోజున ముగ్గు పోసేందుకు యత్నించినట్లు తెలిపారు. అయితే అది వక్ఫ్‌కు సంబంధించిన భూమి అని గ్రామ ప్రజలు అడ్డుకున్నట్లు తెలిపారు. ఈ విషయమై ఈనెల 14వ తేదీన హనుమకొండ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. కలెక్టర్ స్నేహ శబరీష్ వెంటనే స్పందించి డీపీఓను విచారణకు ఆదేశించగా ఆ స్థలం ప్రభుత్వ స్థలంగా నిర్ధారణ అయ్యిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన వక్ఫ్ చట్టం అమలుతోనే మైలారం గ్రామ పంచాయతీ స్థలాన్ని పరిరక్షించినట్లు ఆయన అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మొగిలి, నాయకులు రాజు, నాగరాజు, రమేశ్, రాకేష్‌రెడ్డి పాల్గొన్నారు.



మైలారం గ్రామ పంచాయతీ స్థలాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషిచేయాలి

- మండల అధ్యక్షుడు ప్రకాశ్‌రెడ్డి

దామెర : కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు మన్నెం ప్రకాశ్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మంగళవారం మండల సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ 42 శాతానికి పెంచడం హర్షణీయమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని అన్నారు. ప్రతిఒక్కరూ సమన్వయంతో పనిచేసి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు తోడ్పాలని అన్నారు. మండలంలోని పలు గ్రామాలకు ఇన్‌చార్జ్‌లుగా గుడిపాటి శ్రీధర్‌రెడ్డి, పాలెపాక శ్రీనివాస్, కూనమల్ల రవీందర్, శనిగరం సుధాకర్, దుర్యోధన్ భిక్షపతి, సదిరం పోశాలు, పంచగిరి రాజు, బింగి రాజేందర్, దుబాసి రాధాకృష్ణను నియమించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గ్రామ ఇన్‌చార్జ్‌లుగా నియామకమైన నాయకులు

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయరామారావు

ధర్మసాగర్ : రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండె విజయరామారావు పిలుపునిచ్చారు. ఆ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం మండల కేంద్రంలోని ఆర్ఎన్ఆర్ హైస్కూల్ ప్రాంగణంలో మండల అధ్యక్షుడు కుమార్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని అన్నారు. బూత్‌స్థాయి నుంచి పార్టీ బలోపేతం చేయాలని అందుకు నాయకులు, కార్యకర్తలు కష్టపడాలని సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న తప్పిదాలను ప్రజలకు వివరించాలని అన్నారు. బీఆర్ఎస్ అంతర్గత కుమ్ములాటలతో సతమతమవుతుందని అన్నారు. ప్రజల దృష్టి బీజేపీపై ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు తెలుపాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు యుగేందర్, సుదర్శన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, వీరన్న, శివ ప్రసాద్‌రెడ్డి, సందీప్, శ్రీనివాస్, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయరామారావు

మల్లికార్జునుడికి ప్రదోషకాల నందీశ్వర అభిషేకం



ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

ఐనవోలు : ప్రఖ్యాత మల్లికార్జునస్వామి ఆలయంలో బహుళ త్రయోదశిని పురస్కరించుకుని మంగళవారం అర్చకులు ప్రదోషకాల నందీశ్వర అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నందీశ్వరుడికి ప్రత్యేక పూజలు చేసి పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం నందీశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించి శనిగలు, పండ్లు నైవేద్యం సమర్పించారు. గర్భాలయంలో స్వామివారికి, నందీశ్వరుడికి ఏకకాలంలో హారతి సమర్పించారు. అభిషేకం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు, ముఖ్య అర్చకులు మధుకర్‌శర్మ, వేదపండితులు విక్రాంత్ వినాయక్ జోషి, అర్చకులు నందనం భాను ప్రసాద్, సాయి, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

దామెర : వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఎస్సై కొంక అశోక్ అన్నారు. మండలంలోని ఒగ్లాపూర్ సమీపంలో గల సైలానీ బాబా దర్గా వద్ద మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా రోడ్డు భద్రతా నియమాలు పాటించని పలువురిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ.. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిమానాలతో పాటు జైలు శిక్ష తప్పవని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి సురక్షితంగా గమ్యానికి చేరుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు పాటుపడాలన్నారు. ఏఎస్సైలు యాకయ్య, రాజు, రమేశ్ పాల్గొన్నారు.

నిత్యం అందుబాటులో సఖి సేవలు



సదస్సులో మాట్లాడుతున్న హైమావతి

- సఖి సెంటర్ అడ్మినిస్ట్రేటర్ హైమావతి

కాజీపేట అర్బన్: బాధిత మహిళలు, బాలికలను ఆదుకునేందుకు సఖి వన్‌స్టాప్ సెంటర్ 24గంటల పాటు అందుబాటులో ఉంటుందని సఖి వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ పేర్వారం హైమావతి తెలిపారు. హనుమకొండ ఎక్సైజ్‌కాలనీలోని సఖి సెంటర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సఖి సేవల అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సఖి వన్‌స్టాప్ సెంటర్ ఐదు రకాల సేవలను అందిస్తోందని తెలిపారు. గృహ హింస, లైంగిక వేధింపులు, వరకట్న వేధింపులకు గురవుతున్న బాధిత మహిళలకు ఉచిత కౌన్సెలింగ్, వైద్యం, న్యాయ, పోలీస్ సహాయం, తాత్కాలిక వసతి అందజేస్తున్నట్లు వివరించారు. సఖి సెంటర్ సిబ్బంది శ్రీదేవి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగు పెంచేందుకు చర్యలు

న్యూశాయంపేట: ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణం పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని వరంగల్ కలెక్టర్ సత్యశారద అన్నారు. కలెక్టరేట్‌లో అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో గత మూడేళ్లలో 4,668 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు ద్వారా 1,472 మంది రైతులు లబ్ధి పొందినట్లు తెలిపారు. జిల్లా అధికారులు రాంరెడ్డి, శ్రీనివాస్‌రావు, అనురాధ, నీరజ, కౌసల్యాదేవి, తదితరులు పాల్గొన్నారు.

నేడు మహాలక్ష్మి సంబురాలకు ఏర్పాట్లు

ఆర్టీసీ మహాలక్ష్మి వేడుకలపై మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సత్యశారద సమావేశం నిర్వహించి సూచనలిచ్చారు. వరంగల్ ఆర్టీసీ బస్టాండ్‌లో నిర్వహించే సంబురాలకు మంత్రి కొండా సురేఖ హాజరవుతారని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా అధికారులు రాంరెడ్డి, కౌసల్యాదేవి, వరంగల్–1 డిపో మేనేజర్ అర్పిత తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ అర్బన్:
9951602875 9553955722
9010299096
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎల్. రాకేష్ వర్మ (S.R) : 9885438059 (హన్మకొండ)
వి. రాజ్‌కుమార్ యాదవ్ (S.R) : 9966290903 (హన్మకొండ)
ఎం. మధు (S.R) : 8639566261 (పరకాల)
ఎస్. సతీష్ (S.R) : 8919855163 (ఎల్కతుర్తి)